క్లుప్తంగా

గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రచారం

అరకులోయటౌన్: గ్రామాల్లో పారిశుధ్యంపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో అడపా లవరాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పంచాయతీ కార్యదర్శుల ద్వారా గ్రామాల్లో పారిశుధ్యం నిర్వహణపై ప్రచారం చేయిస్తామని, శనివారం ఈ-వేస్ట్ పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతీ గ్రామ పంచాయతీల్లో కియోసూకలు ఏర్పాటు చేసి చెత్త సేకరించడం, దీనిపై ప్రజాప్రతినిధులు, అధికారుల సమక్షంలో ప్రజలకు అవగాహన కల్పించడం, గ్రామ పంచాయతీ స్థాయిలో ర్యాలీలు, మానవహారం, ప్రతిజ్ఞ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని వియజవంతం చేయాలని ఎంపీడీవో లవరాజు తెలిపారు.

యంత్రాల వినియోగంతో రైతులకు మేలు


టిల్లర్లను పంపిణీ చేస్తున్న సర్పంచ్ కృష్ణ వంశీ, ఏవో మధుసూధనరావు

గూడెంకొత్తవీధి: వ్యవసాయంలో రైతులు యంత్రాలను వినియోగించడం ద్వారా పెట్టుబడులు తగ్గించుకోవచ్చనని తద్వారా ఆదాయం పెరుగుతుందని పెదవలస పంచాయతీ సర్పంచ్ కృష్ణ వంశీ అన్నారు. వ్యవసాయ శాఖ రాయితీపై గిరిజన రైతులకు మంజూరు చేసిన పవర్ టిల్లర్లను గురువారం ఆయన వ్యవసాయాధికారి మధుసూధనరావుతో కలసి పంపిణీ చేశారు. యాంత్రీకరణ పద్ధతులతో రైతులకు మేలు జరుగుతుందన్నారు. ప్రభుత్వం గిరిజన రైతులకు అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. అగ్రికల్చర్ అసిస్టెంట్లు, సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి సమస్యకు పరిష్కారం

కొయ్యూరు: మండలంలోని రాజేంద్రపాలెంలో నెలకొన్న తాగునీటి సమస్యను సర్పంచ్ పీటా సింహాచలం పరిష్కరించారు. గ్రామానికి నీరందించే తాగునీటి పథకం మోటార్ కనెక్షన్‌ను విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు తొలగించారు. దీంతో వారం రోజులుగా నీటి సరఫరా లేక గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సమస్యను గుర్తించిన సర్పంచ్ పీటా సింహాచలం తన సొంత నిధులు రూ.24వేలను ఈపీడీసీఎల్‌కు చెల్లించారు. దీంతో అధికారులు తాగునీటి పథకం కనెక్షన్‌ను పునరుద్ధరించారు. ఫలితంగా గ్రామంలో గురువారం నుంచి తాగునీటి సరఫరా జరిగింది. తాగునీటి సమస్య పరిష్కారానికి కృషి చేసిన సర్పంచ్ సింహాచలంకు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

గ్రామాల్లో వైద్య శిబిరాలు


రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

కొయ్యూరు: మండలంలోని ఎం.భీమవరం పంచాయతీ పరిధిలోని పి.ఎల్.కొత్తూరు, పుట్టకోట, కాకులమామిడి, జ్యోతులమామిడి గ్రామాల్లో యూ.చీడిపాలెం వైద్యుల ఆధ్వర్యంలో గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్యుడు జయప్రకాశ్ శిబిరానికి వచ్చిన రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అంటువ్యాధులపై సర్వేను నిర్వహించారు. జ్వర లక్షణాలతో ఉన్నవారికి రక్త పరీక్షలు చేశారు. ప్రసవానికి రెండు వారాల ముందుగానే ఆస్పత్రిలో చేరాలని గర్భిణులకు సూచించారు. వైద్య సిబ్బంది సోమయ్య, రామలక్ష్మి పాల్గొన్నారు.

సచివాలయ వ్యవస్థను కొనసాగించాలి


గ్రామస్తులతో మాట్లాడుతున్న వైస్ ఎంపీపీ భాగ్యవతి, సర్పంచ్ మిల్కి

ముంచంగిపుట్టు: వనుగుమ్మ పంచాయతీలోని పలు గ్రామాల్లో వైస్ ఎంపీపీ సిరగం భాగ్యవతి, సర్పంచ్ మిల్కి గురువారం పర్యటించారు. వారు మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు ఎంతో మేలు జరిగిందని, సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి చేరాయని గుర్తు చేశారు.అయితే కూటమి ప్రభుత్వం రేషన్‌లైజేషన్ పేరుతో సచివాలయాల కుదింపునకు పాల్పడడం అన్యాయమన్నారు. దీంతో గిరిజనులకు ప్రభుత్వ సేవలు దూరమవుతాయని, సంక్షేమ అందని పరిస్థితి ఉంటుందన్నారు. సచివాలయాల కుదింపు యోచనను తక్షణమే కూటమి ప్రభుత్వం విరమించుకోవాలని డిమాండ్ చేశారు. వార్డు సభ్యులు, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.


సీలేరులో మారెమ్మ అమ్మవారి ఆలయం


అగ్నిగుండం మీదుగా గరగతో గర్భగుడికి వెళ్తున్న భక్తుడు

మూడు ప్రాజెక్టులలో కొలువైన అమ్మవారు

తమిళనాము సంవత్సరంలో ఉత్సవాలు

భక్తులతో కళకళలాడుతున్న ఆలయం

వెలుగులు నింపే కల్పవల్లి.. మారెమ్మ తల్లి


ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

సీలేరు: గిరిజనుల ఆరాధ్య దేవత..ఇలవేల్పుగా మారెమ్మ తల్లిని ఇంటింటా కొలుస్తారు.గడిచిన సుమారు అయిదు దశాబ్దాలకు పైగా సీలేరు విద్యుత్ కాంప్లెక్స్‌తో పాటు మూడు జల విద్యుత్ కేంద్రాల్లో కొలువై వెలుగులు నింపే మారెమ్మ తల్లిగా పేరొందిన అమ్మవారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఏటా తమిళనాడు సంవత్సరాదిలో (తెలుగునాటి ఉగాది వేడుక జరిగిన రెండు వారాల తరువాత) మారెమ్మ ఉత్సవాలకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివస్తారు. కోర్కెలు తీర్చే కల్పవల్లిగా...వెలుగులు నింపే అమ్మవారికి.., గ్రామ దేవతగా, ఆరాధ్య దైవంగా మారెమ్మ అమ్మవారిని భక్తులు కొలుస్తారు. ఈ నేపథ్యంలో అమ్మవారి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేడుకలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చి మారెమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి, మొక్కులు తీర్చుకుంటున్నారు. వేడుకలను పురస్కరించుకొని అమ్మవారికి తమిళ అర్చకులు సుబ్రహ్మణ్యం తొలిపూజ చేశారు. పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ధ్వజస్తంభం వద్ద జెండాను ఎగురవేశారు. 15 రోజుల పాటు ఈ ఉత్సవాలను నిర్వహించడం ఆనవాయితీ. అన్నవరానికి చెందిన భక్తులతో కుంకుమ పూజలు జరిపారు. అమ్మవారి ఉత్సవాల్లో భాగంగా ఈనెల 26వ తేదీన ఉత్సవమూర్తి, గర్భగుడిలో కొలువైన తల్లి గరగలను ఊరేగించి ఇంటింటికి హారతులు పడతారు. 27వ తేదీన పెద్ద ఎత్తున అమ్మవారి ప్రధాన పండుగ జరగనుంది. అనంతరం 30వ తేదీన చల్లనీటి ఉత్సవాన్ని నిర్వహించి పసుపు నీళ్లతో గ్రామాన్ని శుద్ధి చేస్తారు.
తల్లిగరగను నిమజ్జనం చేపడతారు. మరుసటి రోజు మరుపూజ పేరుతో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహిస్తారు.


ఆలయం ప్రవేశ ద్వారం

అగ్నిగుండ కార్యక్రమం కీలక ఘట్టం

ఏటా మారెమ్మ తల్లి ఉత్సవాల్లో కీలక ఘట్టం అమ్మవారి అగ్నిగుండమే..ఉత్సవాలకు శ్రీ కారమైన వెంటనే అమ్మవారి అగ్నిగుండ కార్యక్రమం ప్రారంభమవుతుంది. అగ్ని మీదుగా నడుచుకొని అమ్మవారి గరగను గర్భగుడిలో ప్రతిష్ఠిస్తారు. ఈ ఘట్టము ఎంతో కీలకమైనది. భక్తిశ్రద్ధలతో నియమ నిష్ఠలతో పసుపు వర్ణపు దుస్తులతో మారెమ్మ మాలధారణ భక్తులు కలశ స్థాపన చేపట్టి పంచామృతాలతో అభిషేకాలు చేసి ప్రత్యేక పుష్పాలంకరణతో పూజలు చేశారు. అనంతరం నిప్పుల మీదుగా నడుచుకుంటూ గర్భగుడిలో గరగలను ప్రతిష్ఠించారు. స్థానికులతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు తరలివచ్చారు. మారెమ్మ నామస్మరణతో ఈ ప్రాంతం మార్మోగింది. అమ్మవారి 30 రోజులపాటు నిత్యం కుంకుమ పూజలు నిర్వహిస్తారు. జలవిద్యుత్ కేంద్రం ఉద్యోగులు రోజూ తరలివచ్చి అమ్మవారికి పూజలు చేయడం ఆనవాయితీ.

ఆలయ ప్రాశస్త్యం

సీలేరు ప్రాంతంలో కొలువుదీరిన అమ్మవారు వెలుగులు నింపే మారెమ్మగా పేరొంది. సీలేరు ప్రాంతంలో జల విద్యుత్ కేంద్రం, రిజర్వాయర్‌ను 1953 సంవత్సరానికి ముందు నిర్మించారు. ఆయా నిర్మాణ పనుల్లో ఇక్కడకు వచ్చిన కూలీల్లో ఎక్కువ మంది తమళనాడు నుంచి వచ్చిన వారే. తమిళనాడులో మారెమ్మ తల్లిని ఇలవేల్పుగా కొలుస్తారు. ఆయా కూలీల్లో కొంతమందికి రోజూ ఓ పాము కలలో వచ్చి ఈ సీలేరు ప్రాంతంలో గుడి నిర్మించి పూజలు చేయాలని అమ్మవారు కోరడంతో గుడి నిర్మాణ పనులు చేపట్టినట్టు స్థానిక పెద్దలు చెబుతారు. ఈ నేపథ్యంలో ఇక్కడి రిజర్వాయర్ ఎదురుగా ఓ పాకలో గుడి నిర్మించి పూజలు చేపట్టారు. నాటి నుంచి సీలేరు, డొంకరాయి, పొల్లూరు ప్రాజెక్టులలో అమ్మవారికి గుడి కట్టి నేటికి 53 ఏళ్లుగా పూజలు చేపడుతూ భక్తుల కోర్కెలు తీర్చే తల్లిగా పేరుంది. ఇక్కడి మారెమ్మ తల్లి గుడి నిర్మాణంతోనే సీలేరు జల విద్యుత్ కేంద్రంలో ఎటువంటి ఆటంకాలు లేకుండా పనులు సజావుగా సాగుతున్నట్టు భక్తులు చెబుతున్నారు.

ఇలవేల్పుగా మారెమ్మ



నా భర్త అప్పట్లో సీలేరు ప్రాజెక్టులో ఉద్యోగం చేసేవారు. నాటి నుంచి నేను మారెమ్మ తల్లి భక్తురాలిని. స్థానికుల ఇలవేల్పుగా మారెమ్మ తల్లిని కొలుస్తారు. ఏటా మారెమ్మ తల్లి ఉత్సవాలకు వస్తుంటాను. ఉత్సవాల్లో భాగంగా జరిగిన కార్యక్రమంలో నేను అగ్నిగుండం తొక్కాను. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశాను. అమ్మవారిపై భక్తులందరికీ నమ్మకం ఎక్కువ.

– అప్పలనర్సమ్మ, సీలేరు

నియమ నిష్టలతో పూజలు



మారెమ్మతల్లి నియమ నిష్ఠలతో పూజలు చేస్తాం. సీలేరు, డొంకరాయి, పొల్లూరు ప్రాజెక్టు ప్రాంతాల్లో మారెమ్మ తల్లి ఆలయాలు ఉన్నాయి. ఇక్కడి అన్ని ఆలయాల్లో తమిళనాడు సంప్రదాయాలతోనే అమ్మవారికి పూజలు చేయడం ఆనవాయితీ. మా తాతగారు నాలుగు దశాబ్దాలకు పైగా అర్చకులుగా పనిచేశారు. ప్రస్తుతం నేను పూజలు చేస్తున్నాను. ఆలయానికి భక్తుల తాకిడి రోజురోజుకు పెరుగుతుంది.

– సుబ్రహ్మణ్యం, అర్చకుడు,

నిత్యావసర సరకుల పంపిణీ


నిత్యావసర సరకులు అందజేస్తున్న సర్పంచ్ రామారావు

వి.ఆర్.పురం: మండలంలోని సున్నంమట్కా గ్రామంలో స్థానికులకు నిత్యావసర సరకులను గురువారం కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గానికి చెందిన గామా ఫౌండేషన్ చారిటబుల్ ట్రస్టు ప్రతినిధులు గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు సీఈవో దుర్గాప్రసాద్ మాట్లాడుతూ తమ సంస్థ తరఫున పేద గిరిజనులను ఆదుకునేందుకు పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన నిత్యావసర సరకులను గ్రామస్తులకు సర్పంచ్ పిట్టా రామారావు, సంస్థ ఎంసీవో ముత్తయ్య అందజేశారు. స్వచ్ఛంద సంస్థ అందిస్తున్న సేవలను పలువురు కొనియాడారు. రాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

19న దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి శిబిరం


ఎంపీడీవో శ్రీనివాసరావు

చింతపల్లి: దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి సంబంధించిన గుర్తింపు శిబిరాన్ని ఈనెల 19న నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో శ్రీనివాసరావు గురువారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో చింతపల్లి, గూడెం కొత్తవీధి, కొయ్యూరు మండలాలకు సంబంధించిన దివ్యాంగులకు శనివారం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉపకరణాలు పంపిణీకి అవసరమైన వారి వివరాలు సేకరించనున్నట్టు పేర్కొన్నారు. ఇందులో భాగంగా దివ్యాంగులకు అవసరమైన వినికిడి మిషన్లు, కృత్రిమ అవయవాలు, వీల్ చైర్లు తదితర ఉపకరణాలను త్వరలో పంపిణీ చేయనున్నట్టు తెలిపారు. ఈ శిబిరానికి వచ్చే దివ్యాంగులు పాస్ పోర్టు సైజు ఫొటోలు-2, సదరం సర్టిఫికెట్, ఆధార్‌కార్డులను తీసుకురావాలని సూచించారు.

రన్ ఫర్ జీసెస్‌పై విస్తృత ప్రచారం


రన్ ఫర్ జీసెస్ కార్యక్రమంపై ప్రచారం చేస్తున్న పాస్టర్లు తదితరులు

అరకులోయ టౌన్: మండల కేంద్రంలో యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 6 గంటలకు రన్ ఫర్ జీసెస్ ర్యాలీని నిర్వహిస్తున్నట్టు ఏరియా కో-ఆర్డినేటర్ రెవరెండ్ బి.ఈ.సంజీవ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని ఎన్‌టీఆర్ పార్కు నుంచి మ్యూజియం, హాస్పిటల్ రోడ్డు, క్రైస్ట్ చర్చ్, సీబీఎం చర్చ్ మీదుగా జెడ్పీ గెస్ట్ హౌస్ వరకు ర్యాలీ సాగుతుందన్నారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో క్రైస్తవులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు. అనంతరం రన్ ఫర్ జీసస్ టీ షర్ట్సు, టోపీలు, జెండాలు పంపిణీ చేశారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, కోశాధికారి, జాయింట్ సెక్రటరీ, ఎగ్జిక్యూటివ్ సభ్యులు రెవరెండ్ జాన్, రెవరెండ్ బెంజిమన్, సోనాధర్, రెవరెండ్ జాన్ మోజెస్, ఎలీషా, ఎలీయా రాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


కిలగాడ పీహెచ్‌సీ ఎదుట ప్లకార్డులతో నిరసన చేస్తున్న సీహెచ్‌వోలు

ముంచంగిపుట్టు: తమకు ఉద్యోగ భద్రత కల్పించాలని, జీతాలు పెంచాలని కోరుతూ సీహెచ్‌వోలు గురువారం వైద్యాధికారి రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. మండలంలోని కిలగాడ పీహెచ్‌సీ ఎదుట గురువారం సీహెచ్‌వోలు నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు సీహెచ్‌వోలు ఎంఎల్‌హెచ్‌పీల నుంచి సీహెచ్‌వోలుగా ప్రమోట్ చేసి, పనిభారం అధికం చేశారని, తక్కువ వేతనాలు అందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని వారు కోరారు. సీహెచ్‌వోలు తులసిరత్నం, ఉషారాణి, లలిత, రోషిణి, దీప్తి, రాణి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

హుకుంపేట: గ్రామ సచివాలయ కేంద్రాల్లో సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం చెప్పారు. మండల కేంద్రంలోని సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, స్టాఫ్ గైర్హాజరు వంటి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం మాట్లాడుతూ సిబ్బంది విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సిబ్బంది ప్రజలకు నిత్యం అందుబాటులో సకాలంలో సేవలందించాలన్నారు. సర్పంచ్ సమిడ వెంకటపూర్ణిమ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాంగి అనిల్, పంచాయితీ కార్యదర్శి సత్యనారాయణ తదితరులున్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ బోయినకుమారి, ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: మండలంలోని 16 పంచాయతీల్లో ఎక్కడ తాగునీటి సమస్య తలెత్తినా సత్వరమే అవసరమైన చర్యలు తీసుకోవాలని జీకే వీధి ఎంపీపీ బోయినకుమారి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావుతో కలసి అన్ని పంచాయతీల కార్యదర్శులతో పలు అంశాలపై సమావేశం నిర్వహించారు. హౌసింగ్, సీసీరోడ్లు, తాగు, సాగునీరు, పారిశుధ్య వంటి అంశాలపై మాట్లాడి, పలు సూచనలు చేశారు. ఈవోపీఆర్డీ పాపారావు, పరిపాలనాధికారి ఇమ్మానుయేల్ తదితరులు పాల్గొన్నారు.

వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్


మాట్లాడుతున్న పల్లపు వెంకట్

చింతూరు: ఉపాధి హామీ కూలీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని సీపీఎం మండల కార్యదర్శి పల్లపు వెంకట్ డిమాండ్ చేశారు. ఏడుగురాళ్లపల్లిలో జరిగిన పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పెండింగ్ వేతనాలు చెల్లించడంతో పాటు పని ప్రదేశాల్లో అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించకుంటే కూలీలతో కలిసి ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. నాయకులు సురేష్, లక్ష్మణ్, సుబ్బమ్మ, రాంబాబు, కన్నయ్య, రాజేష్, దేశయ్య తదితరుల పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలకు దరఖాస్తుల ఆహ్వానం

జి.మాడుగుల: జిల్లా షెడ్యూల్డ్ కులస్తుల సేవా సహకార సంస్థ ఆధ్వర్యంలో 2025-26ఆర్థిక సంవత్సరానికి ఎస్సీ నిరుద్యోగ యువతకు 32 వివిధ రకాల స్వయం ఉపాధి పథకాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీవో డేవిడ్‌రాజ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 14 నుంచి మే నెల 10వ తేదీ వరకు దరఖాస్తులు చేసుకోవాలన్నారు. దరఖాస్తు అభ్యర్థుల వయస్సు 21 సంవత్సరాలు నుండి 50 సంవత్సరాలు లోపు ఉండాలని పేర్కొన్నారు. అభ్యర్థుల ఆధార్ కార్డు, పాన్ కార్డు, తెల్ల రేషన్‌కార్డు, కుల ధ్రువీకరణ పత్రాలు ఉండాలని, ట్రాన్స్‌పోర్టు సెక్టార్‌కి దరఖాస్తు చేసుకునే వారికి డ్రైవింగ్ లైసెన్సు వంటివి కలిగి ఉండాలన్నారు.

బీజేపీ తీరుపై ధ్వజం

ఎటపాక: రాహుల్ గాంధీ, సోనియా గాంధీలపై బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తుందని మండల కాంగ్రెస్ పార్టీ నిరసన వ్యక్తం చేశారు. గురువారం పార్టీ మండల అధ్యక్షులు నక్కా వెంకన్న ఆధ్వర్యంలో అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చారు. వెంకన్న మాట్లాడుతూ బీజేపి కుట్ర పూరితంగా చార్జిషీట్ దాఖలు చేయించిందని విమర్శించారు. రాహుల్, సోనియాగాంధీలపై వేసిన కేసులు ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం


వి.ఆర్.పురంలో సీమంతాలు కార్యక్రమంలో పాల్గొన్న తహసీల్దార్ సరస్వతి తదితరులు

హుకుంపేట: మండలంలోని తీగలవలస సెక్టార్‌లోని గుర్రలతోట అంగన్‌వాడీ కేంద్రంలో సీడీపీవో బాలచంద్రమణి ఆధ్వర్యంలో గురువారం పోషణ్ పక్వాడా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. పౌష్టికాహారం తీసుకోవాలని, దీంతో సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందన్నారు. సర్పంచ్ పాంగి బేసు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.
వి.ఆర్.పురం: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో కూనవరం ప్రాజెక్టు అధికారి పి.నాగలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం జరిగిన పోషణ్ పక్వాడాలో భాగంగా సామూహిక సీమంతాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. గర్భిణులు తరచూ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్లు కో-ఆర్డినేటర్లు అంగన్‌వాడీ కార్యకర్తలు, వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు సహకరించాలి


సేబుగూడలో దోమల మందు పిచికారీని పర్యవేక్షిస్తున్న సర్పంచ్ గంగాధర్

ముంచంగిపుట్టు: మండలంలోని మాకవరం పంచాయతీ సేబుగూడ గ్రామంలో సర్పంచ్ గంగాధర్ పర్యవేక్షణలో దోమల నివారణ మందు పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా నివారణకు ప్రజలంతా సహకరించాలన్నారు. ఇంటి లోపల, బయట దోమల నివారణ మందు పిచికారీ చేయించుకోవాలన్నారు. మండల మలేరియా సబ్ యూనిట్ అధికారి నాగేశ్వరరావు మాట్లాడుతూ మండలంలో కిలగాడ పీహెచ్‌సీ పరిధిలో 74 గ్రామాలు, లబ్బూరు పీహెచ్‌సీలో 51 గ్రామాలు చొప్పున్న మొత్తం 125 గ్రామాల్లో మొదటి విడతలో పిచికారీ పనులు చేయిస్తున్నట్టు చెప్పారు. వైద్యాధికారి శ్యాంప్రసాద్, ఈవోపీఆర్డీవో చిన్నాన్న, హెల్త్ అసిస్టెంట్ రాజారావు, లబ్బూరు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలల విలీనం తగదు


సుజనకోట సర్పంచ్ రమేష్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నేతలు

ముంచంగిపుట్టు: ప్రభుత్వ విద్యారంగాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని యూటీఎఫ్ మండల అధ్యక్ష, కార్యదర్శులు సమరెడ్డి రాజు,సీసా గోపిలు అన్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో వారు గురువారం పర్యటించి, ప్రభుత్వ బడులు విలీనం సంస్కరణలకు వ్యతిరేకంగా సర్పంచులను కలిసి వినతిపత్రాలు, కరపత్రాలను అందజేశారు. ప్రభుత్వ బడులు సంరక్షణ కోసం సర్పంచులు పూర్తిగా సహకరించాలని వారు కోరారు. ప్రభుత్వ హైస్కూళ్ల విలీనం వల్ల కలిగే నష్టంపై విస్తృతంగా ప్రచారం చేసి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వం పాఠశాలల మూసివేత యోచనను విరమించుకోవాలన్నారు. నేతలు ధర్మారావు, శ్రీనివాసమూర్తి, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.